క్లుప్తంగా

వృషభాచలేశ్వరస్వామి ఊరేగింపు



ఊరేగింపులో సతీసమేత శ్రీవృషభాచలేశ్వరస్వామి

వేంపల్లె : స్థానిక పాపాఘ్నినది ఒడ్డున ఎద్దుల కొండపై ఉన్న శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించినట్లు ఈవో విశ్వనాథరెడ్డి తెలిపారు. గురువారం దీపావళి పండుగ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వృషభాషలేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ అర్చకులు హరిప్రవీణ్ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. దారి పొడవునా భక్తులు కొబ్బరికాయలను కొట్టి స్వామి వారి ప్రసాదాన్ని సమర్పించారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని కోరుకున్నారు. ఆలయ సిబ్బంది లక్ష్మిరెడ్డి, దాసిరెడ్డి, రంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు

తొండూరు : స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వాతినక్షత్రాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రాతఃకాల సమయం నుంచి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టారు.

సర్పంచ్ మృతి



మృతి చెందిన సర్పంచ్‌కు నివాళులు అర్పిస్తున్న మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ పాశం పెద్దక్క మృతి చెందింది. దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని పాపాఘ్ని నగర్‌కు చెందిన ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతోంది. గురువారం ఆమె నివాసంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ సభ్యులు అబ్బిరెడ్డి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు క్రిష్టారెడ్డి, రామాంజనేయరెడ్డి, బాలిరెడ్డి తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఆటో-బస్సు ఢీ ఇద్దరికి గాయాలు



గాయపడిన హుసేన్‌సాహెబ్

జమ్మలమడుగు రూరల్ : ఎస్.ఉప్పలపాడు గ్రామ రహదారిలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో గురువారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కర్నూల్ జిల్లా నొస్సం గ్రామం నుంచి జమ్మలమడుగుకు ఆటో వస్తుండగా ఆళ్లగడ్డ నుండి జమ్మలమడుగుకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొంది. ఆటోలో ప్రయాణిస్తున్న దిగువ కల్వటాల గ్రామానికి చెందిన హుసేన్‌సాహెబ్‌కు తీవ్ర గాయాలు కాగా, పాపులమ్మ తలకు గాయమైంది. ఇరువురిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొరాయించిన సర్వర్



ముద్దనూరు పంచాయతీ కార్యాలయంలో పింఛనుదారులు

ముద్దనూరు : సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో శుక్రవారం సర్వర్ మొరాయించడంతో రెండు గంటలకు పైగా పింఛన్ల పంపిణీ ఆగిపోయింది. దీంతో పింఛన్ల లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం సర్వర్ పనిచేయడంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్‌లో సమస్యలు తలెత్తడంతో ఈ సమస్య ఎదురైందని అధికారులు తెలిపారు.

అభివృద్ధి మాటున అణగదొక్కే కుట్ర

వల్లూరు (చెన్నూరు) : బ్రిటిష్ కాలం నుంచి ఉన్న రోడ్డును వెడల్పు చేయడం పేరుతో ఒక వర్గాన్ని ఇబ్బందులకు గురిచేసే కుట్ర జరుగుతోందని మైనారిటీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు. ఊర్లోకి రావడానికి ఏర్పాట్లు చేసిన తరువాత మాత్రమే రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని తహసీల్దార్‌ను కోరారు. ఇప్పటికే ఈ విషయంపై నేషనల్ హైవే ఆథారిటీ వారికి కూడా సమాచారం ఇచ్చామని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా అభివృద్ధి పేరుతో రోడ్డును మూసివేస్తే సహకరించబోమని వారు హెచ్చరించారు.

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

- అధికార పార్టీ పేరుతో పనుల పంపాకాలు
- సర్పంచ్‌కు సంబంధంలేకుండానే పనుల కేటాయింపులు



పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే(ఫైల్)

జమ్మలమడుగు/మైలవరం : గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి పనులు అధికార పార్టీ నాయకులకు సంపాదన తెచ్చిపెడుతున్నాయి. ప్రభుత్వం వచ్చిరాగానే గ్రామాలలో అభివృద్ధి పేరుతో పనులకు శంఖుస్థాపనలు చేస్తున్నారు. అయితే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్ పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తామని కేంద్రం నుంచి వస్తున్న నిధులను సక్రమంగా వినియోగం అయ్యేలా రూపకల్పన చేస్తామన్నారు. ఆగస్టు 23వ తేదీన జిల్లాలోని అన్ని పంచాయతీలలో ఒకే రోజు గ్రామ సభలు ఏర్పాటు చేసి గ్రామంలో జరగవలసిన పనులను గుర్తించి పంచాయతీ తీర్మానం తీసుకున్నారు. అయితే గుర్తించిన పనులు రాకపోగ గుర్తించని పనులు వచ్చాయి. వచ్చిన పనులు పంచాయతీలకుగాని, సర్పంచ్‌లకు గాని ఎటువంటి సంబంధంలేకుండానే అధికారులు పార్టీ నాయకులకు పనులను కేటాయించి భూమిపూజలను చేయించారు. వాస్తవంగా సర్పంచ్ ఆధ్వర్యంలో జరుగవలసిన పనులు పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధంలేని వ్యక్తులకు పనులను కేటాయిస్తున్నారు. దీంతో సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే పనులకు సర్పంచ్, గ్రామ సెక్రటరీ జాయింట్ అకౌంట్‌తో పనులకు బిల్లులు చెల్లించేవారు. అయితే ప్రస్తుతం వెండర్ అకౌంట్‌తో పనులు చేయించాలని చూస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో అధికారులు పంచాయతీల ద్వారా 998 పనులను గుర్తించారు. గుర్తించిన పనులకు రూ.75 కోట్లు నిధులను విడుదల చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రభుత్వం సీసీ రోడు, గ్రావెల్ రోడ్డు, ప్రహరి గోడ నిర్మాణాలకు భూమి పూజలను చేసి పననులను ప్రారంభించారు.

రూ.16.14 కోట్ల ఉపాధి నిధులు మంజూరు

జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాలకు సంబంధించిన రూ.16.14 కోట్లు ఉపాధి నిధులు మంజూరయ్యాయి. సిమెంట్ రోడ్లు, డ్రై నేజీ, గ్రావెల్ రోడ్డు, ప్రహరిగోడ నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయి. మండలాల వారిగా జమ్మలమడుగుకు 16 పనులకు గాను రెండు విడతలుగా రూ.3.5 కోట్లు, మైలవరం 21 పనులకు గాను రూ.4.3 కోట్లు, పెద్దముడియం 27 పనులకు రూ.1.83 కోట్లు, కొండాపురం 19 పనులకు రూ.1.61 కోట్లు, ముద్దనూరు 22 పనులకు రూ.1.83 కోట్లు, ఎర్రగుంట్ల 11 పనులకు రూ.2.8 కోట్లు పనులు మంజూరయ్యాయి. కాగా మరో ఆరు బీటి రోడ్లుకు సంబంధించి రూ.5.61 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి.

పంచాయతీకి సంబంధంలేదనడం సరైంది కాదు



గ్రామాలలో పనులను గుర్తించడం కోసం అధికారులు ఆగస్టులో గ్రామ సభలను నిర్వహించి గ్రామ పంచాయతీతో సంతకాలు తీసుకున్నారు. గుర్తించిన పనులకు పంచాయతీకి, గ్రామ సర్పంచ్‌లకు ఎటువంటి సంబంధంలేదని చెప్పడం సరైంది కాదు. పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసినట్లే అవుతుంది.

– జగదీశ్వరరెడ్డి, చిన్నకొమెర్ల సర్పంచ్, మైలవరం మండలం

వెండర్‌ల ద్వారా పనులు చేయడం అన్యాయం



ఎన్డీఏ కూటమి అధికారంలోనికి వస్తే పంచాయతీ రాజ్ వ్యవస్థను బలపరుస్తామన్నారు. పంచాయతీల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు గ్రామ సర్పంచ్, పంచాయతీలకు సంబంధంలేకుండా వెండర్ల ద్వారా పనులు చేయించడంతో పంచాయతీకి తీరని నష్టం జరుగుతుంది.

– రామనాథ్‌రెడ్డి, సర్పంచ్, పి.బొమ్మెపల్లి, జమ్మలమడుగు

కేంద్రం నిధులతోనే ఈ పనులు చేయిస్తున్నాం

ప్రస్తుతం చేపట్టే పనులననీ ఉపాధి హామీ ద్వారా కేంద్రం ఇచ్చిన నిధులతో చేస్తున్నాం. సర్పంచ్‌లకు ఎటువంటి సంబంధంలేదు. వెండర్‌ల ద్వారా పనులు చేయిస్తున్నాము. వారి ఖాతాలలోనే నిధులు జమ చేస్తున్నాము.

– విజయభాస్కర్‌రెడ్డి, డీఈ జమ్మలమడుగు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. పై వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణ పరిధి 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ జేఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్ స్టేషన్, ప్రభుత్వాసుపత్రి ఏరియా, శ్రీనివాస హాలు రోడ్డు, జెండామానువీధి, రోటరీపురం, ఉలిమెల్ల రోడ్డు, అహోబిలాపురం, ముద్దనూరు రోడ్డు, చెన్నారెడ్డి కాలనీ, నగరిగుట్ట, చిన్నన్న రూములు తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

వేంపల్లె : జిల్లాలోని మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించాలని రైతు సంఘం విభాగపు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మస్తాన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ అంతట వర్షాలు లేక కరువుతో అల్లాడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి, వేరుశనగ, కంది, మినుము, వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయని.. దీంతో రైతులు పంటను దున్నేసినట్లు తెలిపారు. ఈసారి రబీలో ఏదోక పంట సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారని, ప్రభుత్వం కరువు మండలాల కింద ప్రకటిస్తే పంట నష్టపోయిన రైతులు బ్యాంకు ద్వారా రీషెడ్యూల్ మంజూరవుతాయన్నారు. దీంతో పెట్టుబడి సాయం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డీఏవీ భారతి విద్యార్థిని ఎంపిక



వైశాలిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్

కమలాపురం : మండల పరిధిలోని నల్లింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లోని డీఏవీ భారతి పాఠశాలకు చెందిన విద్యార్థిని వైశాలి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ ఎస్. కిషోర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొన్న డీఏవీ భారతి స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వై.వైశాలి అండర్-17 బాలికల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వైశాలి పాల్గొంటుందని ఆయన తెలిపారు. పరిశ్రమ సీఎంఓ ఓ. సాయిరమేష్, ప్రాంతీయ అధికారి శేషాద్రి, హెచ్‌ఆర్ చీఫ్ గోపాల్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ భార్గవ్‌రెడ్డి తదితరులు విజేతతో పాటు పీడీ చందును అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం రాణించాలని వైశాలిని వారు సూచించారు.

అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగాలు మరువలేనివి



పొట్టిశ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగాలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రాముడుతో కలిసి ఆయన పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం పొట్టిశ్రీరాములు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా చెన్నూరు బీజేపీ మండల నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ ఉపాధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఒక భాషా ప్రాతిపదిక రాష్ట్రంగా ఏర్పడడానికి ముఖ్య కారణమైన అమరజీవిని స్మరించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోసం ఆయన చేసినటువంటి ఆమరణ నిరాహార దీక్ష గురించి, ఆయన చేసిన త్యాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస రాజు, జిల్లా బీజేవైఎం నాయకులు వీరప్రతాప్, మండల బీజేవైఎం అధ్యక్షుడు కాశి, కమలాపురం మాజీ కన్వీనర్ ముకుందాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు కృషి చేద్దాం

వేంపల్లె : కార్మికుల హక్కుల సాధన కోసం కృషి చేద్దామని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మిక వర్గానికి అండగా ఉంటూ, వీరి హక్కుల సాధనకు ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి 44 కార్మిక చట్టాలను సాధించిన చరిత్ర ఏఐటీయూసీ దేనన్నారు. నేటి పాలకులు ఆ కార్మిక చట్టాలను తూట్లు పొడిచి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని, ఇవి కార్మిక వర్గాలను బానిసలుగా మార్చే విధంగా ఉన్నాయన్నారు. వీటి రద్దు కోసం ఏఐటీయూసీ పోరాడుతున్నట్లు వెల్లడించారు. మండల అధ్యక్షుడు దస్తగిరి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కోశాధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం



జాతీయ సమైక్యతపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్టు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గురువారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని దేశమంతలా నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ మాట్లాడుతూ వివిధ జాతులు, సంస్కృతులు మతాలకు నిలయమైన భారతదేశం వంటి భిన్న దేశంలో జాతీయ సమైక్యత అనేది అత్యంత ఆవశ్యక మైందన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే దీపావళి పండుగ సందర్భంగా దీపాలను వెలిగించి అందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం జాతీయ సమైక్యతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జే .దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ఆర్టీపీపీ ఏఐటీయూసీ జెండాను ఎగుర వేస్తున్న కార్మిక సంఘం నేతలు

ఎర్రగుంట్ల : కార్మిక హక్కుల కోసం ఏఐటీయూసీ 105 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటాలు చేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శివయ్య తెలిపారు. ఆర్టీపీపీ ఏఐటీయూసీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఎగుర వేశారు. విద్యుత్ రంగంలో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



కమలాపురం : కుటుంబ సభ్యులతో టపాసులు కాల్చుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : దీపావళి వేడుకలను ఇంటింట సంతోషంగా జరుపుకున్నారు. గురువారం దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రజలు తమ ఇళ్లను దీపాలు వెలిగించి శోభాయమానంగా తీర్చిదిద్దారు. పిల్లలు అప్పటికే సిద్ధం చేసుకున్న కాకరత్తులు, చిచ్చుబుడ్లు వెలిగించారు. థౌంజడ్ వాలా, లక్ష్మీ పటాకులు, రాకెట్లు తదిరత వాటిని పోటా పోటీగా పేల్చారు. మార్కెట్ యార్డు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద కొనుగోలుదారులు అధిక సంఖ్యలో రావడంతో అక్కడ సందడి నెలకొంది. కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలసి టపాసులు కాల్చి దీపావళి సంబరాలు చేసుకున్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కమలాపురంలోని మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద పర్యవేక్షించారు. అగ్ని మాపక శాఖ అధికారులు ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా దుకాణాదారులకు తగు సలహాలు, సూచనలు అందజేశారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రతి ఇంటి ముంగిట దీప కాంతులు మిరుమిట్లు గొలిపాయి. దీపావళి పండుగ కావడంతో మహిళలు ఇంటి ముంగిట దీపాలను వెలిగించి ఇంటింటా దీప కాంతులు వెదజల్లాయి. చిన్నారులు టపాసులు కాల్చుతూ ఆనందంగా గడిపారు. టపాసుల ధరలు ఆకాశన్నంటాయి. సామాన్యుడి కొనుగోలు చేయలేని పరిస్థితిలో టపాసుల ధరలు పలకడంతో సామాన్యుడి కొంత సొమ్ముతో టపాసులను కొనుగోలు చేసి పండుగ జరుపుకున్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం దీపావళి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాత్రి పిల్లలు, పెద్దలు, మహిళలు ఇళ్ల ముందర టపాసులు, బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. వాడవాడలా పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా సందడి చేశారు.



పులివెందులలో టపాసులు కాల్చుతున్న చిన్నారి



లింగాలలో చిచ్చుబడ్డీని కాల్చుతున్న మహిళలు

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం కడప జెడ్పీ సీఈఓ ఓబులమ్మ తనిఖీ చేశారు. అంతకమునుపు ఆమె చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సందర్శించారు. అక్కడ నుంచి లింగాల ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పనులు, గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆమెను ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ జయశ్రీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

31న జిల్లా జట్ల ఎంపిక

జమ్మలమడుగు : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల్ బ్యాడ్మింటన్ జట్లకు బాల బాలికల ఎంపికను నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, కార్యదర్శి వెంకటరమణలు తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా సీనియర్ బాల బాలికల జట్ల ఎంపిక ఈనెల 31వ తేదీ ఆదివారం పెద్దముడియం మండలం పెద్దపసుపల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరుగుతుందన్నారు. ఎంపికైన జిల్లా జట్లలోని క్రీడాకారులకు, క్రీడాకారిణిలకు కోచింగ్ క్యాంపును 5, 6, 7వ తేదీలలో ఉంటుందన్నారు. సీనియర్ జట్లకు ఎంపికైన వారు నంద్యాల జిల్లాలో 8, 9, 10వతేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా పుట్టిన తేది ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికేట్, డ్రస్‌కోడ్, షు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇంకా వివరాలకు 9490181104 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు.

4న స్కిల్ సెన్సస్‌సర్వేపై శిక్షణ

ముద్దనూరు : ఈనెల 4వ తేదీన సచివాలయ ఉద్యోగులకు స్కిల్ సెన్సస్ సర్వేపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ముకుందరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో 4వ తేదీన మధ్యాహ్నం 3 గంటలనుంచి గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని సచివాలయ సిబ్బంది అందరూ శిక్షణకు హాజరుకావాలని ఆయన సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు దళితవాడ గ్రామానికి చెందిన వేంపల్లె వరపుత్రుడు(40) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గత నెల 25వ తేదీన ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చేలరేగి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కొసం కడప రిమ్స్ నుంచి తిరుపతిలోని ప్రయివేట్ అసుపత్రికి తరలించారు. తిరుపతిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భా ర్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆ కుటుంబంలో విషాధచాయలు అలుముకున్నాయి.

వైఎస్ ప్రమీలమ్మకు జ్ఞాపిక అందించిన వైఎస్ జగన్



మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ వైఎస్ ప్రమీలమ్మకు జ్ఞాపికను అందిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్, తదితరులు

పులివెందుల రూరల్: పులివెందుల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ వైఎస్ ప్రమీలమ్మకు ఆమె మాతృమూర్తి, నేత్రదాత చవ్వా వేదామణి జ్ఞాపికను మాజీ సీఎం వైఎస్ జగన్ బుధవారం మధ్యాహ్నం అందజేశారు. ఇటీవల చవ్వా వేదా మణి మరణించారు. దీంతో ఆమె కుమార్తె, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ, అల్లుడు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డిలు నేత్రదానానికి అంగీకరించి నేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో వేదామణి కళ్లు దానం చేశారు. ఈ నేపథ్యంలో నేత్ర సేకరణ సంస్థ అధ్యక్షుడు రాజు మాజీ సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా నేత్రదాత కుటుంబ సభ్యులైన వైఎస్ ప్రమీలమ్మకు జ్ఞాపికను అందించారు.

జాతీయ మహాసభకు తరలిరండి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

పులివెందుల టౌన్ : ఈనెల 5వ తేదీన విజయవాడలోని హనుమంతరావు గ్రంథాలయంలో జరిగే ఎమ్మార్పీఎస్ 11వ జాతీయ సభకు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం పులివెందులలో ఎమ్మార్పీఎస్ సంఘ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జాతీయ షెడ్యూల్ కులాల వర్గీకరణకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని, సుప్రీం కోర్టు ధర్మాసనం ఏడుగురు జడ్జీలతో ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ రిజర్వేషన్లు అఆఇఈలుగా నియామకం చేయాలన్నారు. ఇప్పటికే 2024లో వర్గీకరణ రద్దు కావడంతో ఇ లోని మాదిగ ఉప కులాలు వారి ఉద్యోగ వయోపరిమితి మించిపోవడంతో తీరని నిరాశకు గురయ్యారన్నారు. ఉద్యోగుల వయోపరిమితిని మరో ఐదేళ్లకు సడలించాలన్నారు. రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు షెడ్యూల్డ్ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం తమ వర్గాలకు రావడంలేదన్నారు. మాదిగ ఉప కులాలు అన్ని ఐక్యం కావాలని, ఎస్సీ బోగస్ సర్టిఫికెట్స్ జారీ చేయకుండా అధికారులు అడ్డుకట్ట వేయాలని, ప్రతి జిల్లాలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులు గ్రామ సచివాలయాల నుండి వెలువడే ఎస్సీ సర్టిఫికెట్ల పైన నిఘా ఉంచేందుకు ప్రత్యేక విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మాదిగ డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.కృష్ణమూర్తి, ఎమ్మార్పీఎస్ నాయకులు గంగులయ్య, గంగులయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీఅంకాలమ్మతల్లి పునఃప్రతిష్ట వేడుకలు



శ్రీఅంకాలమ్మ తల్లి ఆలయం

తొండూరు : మండలంలోని ఇనగలూరు గ్రామంలో నూతనంగా పునఃనిర్మించిన శ్రీఅంకాలమ్మ తల్లి మహా సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించనున్నట్లు అమ్మవారి సేవకులు పెద్ద ఎరుకలరెడ్డి, అర్చకులు జగదీశ్వరరావులు తెలిపారు. శనివారం ఆలయంలో గణపతి పూజ, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 3వ తేదీ ఆదివారం ఉదయం హోమాలు, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, కోలాటం, 4వ తేదీ సోమవారం అమ్మవారి యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, కలశ సంప్రోక్షణ, మహా నివేదన కార్యక్రమాలతోపాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం, అఖండ భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కావున ఈ వేడుకలకు భక్తులు పెద్ద ఎక్కువ జయప్రదం చేయాలని వారు కోరారు.